ప్రజాశక్తి
ఆదివారం 5 అక్టోబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

పల్లె వెలుగు బస్సుల రద్దుతో ఇబ్బందులు

ప్రజాశక్తి-చింతపల్లి : మారుమూల గిరిజన గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు రద్దు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో తూరుమామిడి, దామనపల్లి, పెదవలస, కొమ్మంగి వంటి గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నిత్య సర్వీసులు నడిపేవి. ఇప్పుడు ఆ బస్సులు నిలిపివేయడంతో మార్కెట్లు, ఆసుపత్రులు, పట్టణాలకు వెళ్లడానికి ఈ మార్గంలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నర్సీపట్నం డిపో నుంచి టూ-స్టాప్ బస్సులు మాత్రమే నడుస్తుండగా, అవి మధ్య గ్రామాల్లో ఆగకపోవడం వల్ల ప్రజలు కిలోమీటర్ల దూరం నడిచి బస్సు స్టాండ్‌లకు చేరుకోవాల్సి వస్తోంది. వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. తమ ఊరికి బస్సు ఉండేదని, మార్కెట్‌కి, పాఠశాలకు వెళ్లడం సులభమయ్యేదని, ఇప్పుడు ఆటోలు కూడా రావడం లేదని తూరుమామిడి గ్రామానికి చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పల్లెవెలుగు బస్సు సర్వీసులను, ముఖ్యంగా సంత ప్రత్యేక బస్సులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యలపై గరం గరం

- ప్రజలకు హానిచేసే హైడ్రో, బల్క్ డ్రగ్ ప్రాజెక్టులు వద్దు
- అల్లూరి జిల్లా కలెక్టర్ తీరుపై ఏజెన్సీ జెడ్‌పిటిసిలు ఆగ్రహం
- చైర్‌పర్సన్ పోడియం ఎదుట నిరసన
- వాడీవేడిగా జెడ్‌పి సర్వసభ్య సమావేశం

జెడ్‌పి చైర్‌పర్సన్ పోడియం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏజెన్సీ జెడ్‌పిటిసిలు గంగరాజు, తదితరులు

అల్లూరి కలెక్టర్‌ను ఫోనులో వివరణ కోరుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా సాగింది. ప్రజా సమస్యలపై జెడ్‌పిటిసిలు ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజలకు హాని కలిగించే హైడ్రో పవర్ ప్రాజెక్టులు, బల్క్ డ్రగ్ పార్కును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జెడ్‌పి సర్వసభ్య సమావేశం జరిగింది. సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు రోజులుగా విద్యుత్, నీటి సరఫరా లేదని, సెల్ ఫోన్ల వెలుతురులో ఆపరేషన్లు చేసే పరిస్థితి నెలకొందని చెప్పారు. ఇంత దారుణమైన పరిస్థితి ఉన్నప్పటికీ అక్కడి కలెక్టర్ స్పందన కరువైందన్నారు. గిరిజనులంటే ఆయనకు, ఉన్నతాధికారులకు ఎంత నిర్లక్ష్యమో ఈ సంఘటన రుజువు చేస్తుందన్నారు. ఈ విషయాన్ని జెడ్‌పి సమావేశంలో ప్రశ్నించాలని గిరిజన ప్రాంత జెడ్‌పిటిసిలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారని, కలెక్టర్ మాత్రం హాజరుకాలేదని తెలిపారు.

ఇదే కలెక్టర్ తమ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం అరకు కేంద్రంగా జిల్లా అధికారులను వెంటబెట్టుకొని నవయుగ, అదాని కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు గిరిజనులను ఒప్పించడానికి మాత్రం వస్తున్నారని మండిపడ్డారు. గిరిజన సమస్యలపై కలెక్టర్ నిర్లక్ష్య తీరును ఖండిస్తూ గంగరాజు నాయకత్వంలో ఏజెన్సీ ప్రాంత జెడ్‌పిటిసిలు శెట్టి రోషిణి (అరకు), కూడ బొంజుబాబు (పెదబయలు) తదితరులు జెడ్‌పి చైర్‌పర్సన్ పోడియం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. స్పందించిన చైర్‌పర్సన్ సుభద్ర సమావేశంలో ఉండగానే అల్లూరి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి పాడేరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితిని వివరించారు. ఎందుకు చర్య తీసుకోలేదని ప్రశ్నించారు. అనంతరం ఏజెన్సీ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని గంగరాజు ప్రతిపాదించగా ఈ ప్రాజెక్టుల వల్ల ఏజెన్సీ ప్రాంతం ముంపునకు గురవుతుందని, వాతావరణానికి, రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఆ ప్రాజెక్టులను ఆపాలని, ప్రస్తుతం జరుగుతున్న సర్వేను వెంటనే నిలిపివేయాలని ఏజెన్సీ జెడ్‌పిటిసిలు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో రైతులకు అందిస్తున్న ఉచిత విత్తనాలు నాసిరకంగా ఉన్నాయని, బూజు పట్టాయని తెలిపారు. అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలి : బొత్స

శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఫ్యాక్టరీ రైతులకు బకాయి ఉన్న సుమారు రూ.30 కోట్లను తక్షణమే ఇవ్వాలన్నారు. ఫ్యాక్టరీకి మొత్తం ఉన్న బకాయిలు రూ. 178 కోట్లను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ఫ్యాక్టరీని సహకార రంగంలోనే కొనసాగించాలని కోరారు. బుచ్చెయ్యపేట జెడ్‌పిటిసి దొండా రాంబాబు కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఈ అంశంపై బొత్స సత్యనారాయణ చేసిన ప్రతిపాదన మేరకు ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం ఆమోదించారు. రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేస్తున్న ప్రమాదకర బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలన్నారు. ఈ విషయమై ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించాలని ఆయన ప్రతిపాదించగా సమావేశం ఆ మేరకు తీర్మానాన్ని ఆమోదించింది. శాసనమండలి సభ్యురాలు వరుదు కల్యాణి మాట్లాడుతూ మాకవరపాలెం మండలంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం చేయడం తగదన్నారు. అచ్యుతాపురం మండలం పారిశ్రామిక ప్రాంతమని, అక్కడ తరచూ ప్రమా దాలు జరుగుతున్నాయని, అంబులెన్సు లు తక్కువగా ఉండటం వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోవలసి వస్తోందని అచ్యుతాపురం, మునగపాక జెడ్‌పిటిసిలు తెలిపారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ అల్లూరి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సరైన వైద్య సదుపాయం అందక గిరిజన ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిషత్ ఉప కార్యనిర్వహణ అధికారి కె.రాజ్ కుమార్, పరిషత్ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌పై ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

హారతి ఇస్తున్న వాళ్ల రంగారెడ్డి

గోదావరి, శబరికి జలహారతి

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలో తుమ్మిలేరు పంచాయతీ పోచవరంలో బోట్‌పాయింట్ వద్ద భద్రాద్రి పాపికొండలు బోట్ యూనియన్ యాజమాన్య సభ్యులు గోదావరి, శబరి శాంతించాలని పాపికొండల విహారయాత్ర బోటింగ్ ఎటువంటి ఆటంకాలు లేకుండా దిగ్విజయంగా కొనసాగాలని శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి శబరి సంగమం వద్ద పసుపు కుంకుమ, గాజులు పట్టువస్త్రాలు సమర్పించారు. తరువాత శబరి, గోదావరికి హారతి కార్యక్రమం నిర్వహించారు. పాపికొండలు బోటు యాజమాన్య యూనియన్ అధ్యక్షులు వాళ్ళ రంగారెడ్డి, ఉపాధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు, సభ్యులు బోట్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - కూనవరం: మండలంలోని పెద్ద ఆర్యూర్ సర్పంచ్ నాగమణి అంగన్‌వాడి కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. అంగన్‌వాడి భవనం శ్లాబ్ పెచ్చులూడుతోందని సమస్యను పిఒ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పిల్లలకు ఏ విధంగా ఫీడింగ్ ఇస్తున్నా రనే వివరాలడిగి తెలుసుకున్నారు.

వివరాలు తెలుసుకుంటున్న సర్పంచ్ నాగమణి

లోతారామారావును పరామర్శిస్తున్న జెఎసి నేతలు

లోతా రామారావుకు జెఎసి నేతల పరామర్శ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం తన స్వగ్రామమైన లోదొడ్డిలో విశ్రాంతి తీసుకుంటున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావును ఆదివాసి జెఎసి నాయకులు వెదుళ్ళ లచ్చిరెడ్డి, వంతు బాలకృష్ణ తదితరులు శనివారం పరామర్శించారు. రామారావు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆదివాసీ జెఎసి నాయకులు వజ్రపు అప్పారావు, ఇ.సిరిమల్లెరెడ్డి, జుర్రా లక్ష్మయ్య, ఆదివాసీ నిరుద్యోగ సంఘం నాయకులు గుమ్మడి లోవప్రసాద్, రాజ్‌కుమార్, గుమ్మడి లోవరాజు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానం శ్రేయస్కరం

- ప్రభుత్వ సలహాదారు విజయ్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ప్రకృతి వ్యవసాయ విధానం మానవ జీవనానికి శ్రేయస్కరమని ప్రభుత్వ సలహాదారులు టి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 22 మండలాల విఎఎస్, విహెచ్ఎస్, ఎంఎఒలు, ఎఫ్‌పిఒలు, ఎన్‌జిఒలు, రైతులు, ప్రైమరీ సెక్టార్ అధికారులతో ప్రకతి వ్యవసాయం వ్యవసాయ విధానంపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచమంతా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో భూతాపాన్ని ఎలా తగ్గించాలని నిర్వహించిన ఒక సర్వేలో పంట లేని పొలాల్లో ఎక్కువ ఉష్ణోగ్రత ఉందని, పంట వేసి యూరియా వాడిన పొలాల్లో కొంచెం తక్కువగాను, ప్రకృతి విధానంలో సాగు చేసిన పొలంలో మరింత ఉష్ణోగ్రత తగ్గినట్లు స్పష్టమైందన్నారు. రాష్ట్రం మొత్తం అన్ని గ్రామాల్లోనూ ప్రకృతి వ్యవసాయం చేయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానంలో లాభాలు వివరించారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రకృతి వ్యవసాయంపై చూపే శ్రద్ధ, చొరవను అభినందించారు. ఆరోగ్యపరమైన మొక్కలకు తెగుళ్లు, బ్యాక్టీరియా, ఫంగస్ పట్టమని, ప్రకృతి వ్యవసాయం వల్ల ఖర్చులు తగ్గి ఉత్పత్తి పెరుగుతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసే మొక్కలకు వరదలు తట్టుకునే శక్తి కూడా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ, ఉద్యాన విలేజ్ అధికారులకు రెగ్యులర్ శిక్షణనివ్వాలని సూచించారు. ప్రైమరీ సెక్టార్ లో ఉన్న వాళ్ళందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై తీసుకునే చర్యలు వివరించారు. జిల్లా లో 22 మండలాలను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకుని వెళ్లే కార్యాచరణ ప్రణాళికను వివరించారు. జిల్లాలో రెండు లక్షల 75 వేల మంది రైతులు ఉన్నారని, 2027-28 జిల్లా మొత్తం ప్రకృతి వ్యవసాయంగా మారుతుందన్నారు. జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒలు క్షేత్ర సందర్శన చెయ్యాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్, పాడేరు ఐటడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ, రంపచోడవరం పిఒ స్మరణ రాజ్, మాజీ డైరెక్టర్ టి బాబూరావు నాయుడు, జిసిసి ఎండి కల్పనా కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బిఎస్ నందు, జిల్లా ఉద్యాన అధికారి, డిఆర్‌డిఎ పీడీ మురళి, కాఫీ బోర్డు ఉపసంచాలకులు హెచ్‌ఆర్ మురళీధర్, స్పైసెస్ బోర్డ్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ కల్యాణి పాల్గొన్నారు.

ఐటిఐలో మధుమితకు జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మండలంలోని మాకవరం గ్రామానికి చెందిన పాంగి రామదాసు, డొమైలా దంపతుల కుమార్తె పాంగి మధులత కంచరపాలెం ఓల్డ్ ఐటిఐలో ఆర్ అండ్ ఎసి ట్రేడ్ కోర్సులో 1200 మార్కులకు 1194 మార్కులు సాధించి జాతీయస్థాయిలో మొదటి ర్యాంకుతో సత్తా చాటింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా శుక్రవారం ప్రశంసాపత్రాన్ని స్వీకరించింది. ఈ సందర్భంగా మధులత మాట్లాడుతూ ప్రాథమిక విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలో సాగిందని,ఒకటి రెండు తరగతులు మాకవరంలోని ఎంపిపి పాఠశాలలో చదివానన్నారు. కుటుంబ పరిస్థితులు అనుకూలించనప్పటికీ తన తండ్రి దృఢ సంకల్పంతో పెదగంట్యాడ నడుపూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదవించారని,తర్వాత పెందుర్తి జెడ్‌పి హైస్కూల్ వద్ద పదవ తరగతి పూర్తి చేశానన్నారు. 2024 - 25 విద్యాసంవత్సరంలో.కంచరపాలెం ఓల్డ్ ఐటిఐలో ఆర్ అండ్ ఏసి ట్రేడ్ కోర్సు చేరి ఇష్టంగా చదివానన్నారు. తనకు జాతీయస్థాయిలో మొదటిర్యాంకు రావడం, ప్రధాని నుంచి ప్రశంసాపత్రాన్ని స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రధాని మోడీ నుంచి ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న మధుమిత

ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ఆటోలో వెళుతూ అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి



డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి తదితరులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు అండగా నిలిచేందుకు ఆటోడ్రైవర్ల సేవలో పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. శనివారం పాడేరు ఐటిడిఎ సమావేశ మందిరంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో సాయం చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఆటోడ్రైవర్లకు రూ.10వేలు ఇవ్వగా, టిడిపి కూటమి ప్రభుత్వం రూ.15వేలు అందిస్తోందన్నారు. అల్లూరి జిల్లాలో 4,217 మంది ఆటోడ్రైవర్లకు రూ.63 కోట్ల 2లక్షల 55వేలు లబ్ధి చేకూరుతుందన్నారు. వాహనాలపై గత ప్రభుత్వంలో ఉన్న గ్రీన్ ట్యాక్స్‌ను కుదించి వాహనదారులకు కూటమి ప్రభుత్వం ప్రయోజనం చేకూర్చిందన్నారు.కార్యక్రమంలో జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ టి.శ్రీపూజ, పాడేరు టిడిపి ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి, కూటమి నాయకులు వి.గుంగులయ్య, బొర్రా నాగరాజు, ఐటిడిఎ అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు పాతబస్టాండ్ నుంచి ఐటిడిఎ వరకు ఆటో డ్రైవర్లతో ర్యాలీలో పాల్గొన్నారు.

చింతపల్లి : మండలకేంద్రంలో ఎంపిడిఒ కనకమహాలక్ష్మి, కూటమి నాయకులు ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండలంలో మొత్తం 242 మంది డ్రైవర్లకు ఈ పథకం వర్తించినట్లు చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం : ఆటో డ్రైవర్‌లకు అందిస్తానన్న ఆర్థిక సాయం అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం విధానం భేష్ అని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ శిరీషదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆటోమిత్ర పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తొలుత స్థానిక ఎన్టీఆర్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆటో డ్రైవర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో సుమారు 1,366 మంది ఆటో డ్రైవర్లు కు నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చిన్నంబాబు రమేష్, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ డైరెక్టర్ గొర్లె దెబోరా సునీత తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎలో సచివాలయ ఉద్యోగులను తిరిగి పంపాలి

ప్రజాశక్తి-కూనవరం: సచివాలయాల్లో పని చేస్తున్న డిజిటల్ ఆపరేటర్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను మళ్ళీ సచివాలయానికి పంపాలని కూటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ అన్నారు. కూటూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సచివాలయంలో డిజిటల్ ఆపరేటర్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు అందుబాటులో లేక పంచాయతీ ప్రజలు సర్టిఫికెట్స్ చేయించడానికి వందల రూపాయలు ఖర్చు చేసి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు గురించి తెలియజేసేందుకు సిబ్బంది లేక ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఐటిడిఎలో అవసరం అనుకుంటే ప్రత్యేక సిబ్బందిని నియమించాలి తప్ప సచివాలయం ఉద్యోగులను అక్కడికి తీసుకెళ్లి వారితో పనిచేయించడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఐటిడిఎ పిఒ, పోలవరం ప్రాజెక్టు అధికారులు స్పందించి సచివాలయం ఉద్యోగులను వెంటనే అక్కడ నుండి రిలీవ్ చేసి కూటూరు సచివాలయానికి పంపాలని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు రానిపక్షంలో ప్రజలను తీసుకుని ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య, మాజీ ఎంపిటిసి మేకల నాగేశ్వరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 7వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 80/2025

Between:
1. Danam Sadhana
2. Danam Karthikeya Chandra sekhar
3. Danam Jishnav Chowdari

(Plaintiffs 2 and 3 are being minors Represented by their mother / narural Guardian)

...Plaintiff

AND

1. District Registrar of Births and Deaths, Alluri Seetha Rama Raju District.
2. The Thasildar, Alluri Seetha Rama Raju District.
3. The Collector, Alluri Seetha Rama Raju District.
4. Dy.Director (A/cs), CRPF, New Delhi, Plot No. 14, PSP-2, Sector-23, Rohini New Delhi.

...Defendants

పై నెంబరు దావాలో భార్య భర్తలు అయిన శ్రీ దానం శివరామకృష్ణ, దానం సాధన లకు 1) దానం కార్తికేయ చంద్రశేఖర్, 2) దానం జిష్ణవ్ చౌదరి అను ఇద్దరు పిల్లలు ఉండి ఉన్నారు. దానం శివరామకృష్ణ CRPF ఉద్యోగిగా పని చేస్తున్నారు. తన సెలవులు అనంతరం తూ॥గో॥జిల్లా నెల్లిపూడి గ్రామం గంగవరం మండలం, ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా తన స్వగ్రామంనకు వచ్చి తిరిగి తన ఉద్యోగం నిమిత్తం బయలుదేరి వెళుతూ దిమాపూర్ రైల్వేస్టేషన్‌లో దిగి 20-5-2017వ తేదీన ఇంఫాల్ వెళ్ళుటకు ఒక ప్రైవేట్ వాహనము ఎక్కి ఉన్నాడు. దర్మిలా అప్పటినుండి కనబడుటలేదు మరియు అతని సెల్‌ఫోన్ కూడా పనిచేయడం లేదు. ఈ విషయం దానం సాదన ఇంఫాల్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు రిజిస్టర్ (FIR) చేసుకొని యున్నారు. అప్పటినుండి ఎంత వెతికిన కనిపించలేదు. అతని ఆచూకీ తెలియలేదు. కనుక శ్రీ దానం శివరామకృష్ణ మిస్సింగ్‌ను డెత్‌గా డిక్లేరు చేయమని పై కోర్టు వారి ఎదుట దావా దాఖలు చేసుకొనియున్నారు. కావున సదరు **దావా 10-11-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు వాయిదా కలదు.** కావున దానం శివరామకృష్ణ కనపడకపోవడంపై గంగవరం మరియు తూ॥గో॥జిల్లా రాజమండ్రి పరిసర ప్రాంత ప్రజలకు ఎవరికైన అభ్యంతరములు ఉన్న ఎడల మీరు గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని కోర్టు వారి ముందు హాజరై మీ అభ్యంతరములను తెలియపర్చవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది. లేని ఎడల సదరు దావా పై కోర్టు వారు చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకొందురు.

బి.వి.సుభద్ర, అడ్వకేట్
రాజమండ్రి ఆర్యాపురం, రాజమండ్రి
04-10-25 సెల్: 9849638630

హైడ్రో అనుమతులు రద్దు చేయాలి

ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

ప్రజాశక్తి -అనంతగిరి : హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన ఆందోళన చేపట్టారు. శనివారం పైనంపాడు పంచాయతీ సచివాలయం కేంద్రంలో మండల ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షులు సివేరి. కొండలరావు ఆధ్వర్యంలో పంచాయతీ ప్రజలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు కోరుతూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ,. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులు చట్టాలను తుంగలో తొక్కి, గిరిజనులు ఆమోదం లేకుండా ఏకపక్ష నిర్ణయంతో అదానీ, నవయుగ సంస్థలకు ఆదివాసీ భూములను కట్టబెడుతూ జిఒ 51, 13లను తెచ్చారన్నారు.

పైనంపాడు పంచాయతీ కాకరపాడు. ఎగువశోభ, దిగువశోభ, మూలపటం, దుర్గం, పనసలవర. జాగరవలస ఈదులుపుట్టు,. కాంపుట్టు తదితర గ్రామాలు పూర్తిగా కనుమరుగే ప్రమాదం ఉందని, తక్షణమే ఒప్పంద జిఒలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకాకుండా వేంగ్డ, వాలసి పంచాయతీల 10 గ్రామాలతోపాటు హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పరిధి మజ్జివలసతోపాటు అనేక గ్రామాలు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. స్థానిక గిరిజనుల మనోవేదనను దృష్టిలో పెట్టుకుని తక్షణమే హైడ్రో అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వైసిపి మాజీ వైస్ ఎంపిపి సీదరి గుండన్న, మాజీ సర్పంచ్ బుజ్జన్న,పీసా కమిటీ అధ్యక్షులు గిరిజ పాల్గొన్నారు.

పునరావాసం అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- సిపిఎం పట్టణ కార్యదర్శి కొండా ఈశ్వర్లు



మాట్లాడుతున్న కొండా ఈశ్వర్లు

ప్రజాశక్తి -కూనవరం: పోలవరం పునరావాస ప్యాకేజి అందించే విషయంలో జరిగే అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కొండా ఈశ్వర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం పట్టణశాఖ సమావేశం నోముల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. పట్టణ కార్యదర్శి ఈశ్వర్లు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు స్ట్రక్చర్ వ్యాల్యూయేషన్ ఒకే ప్రాంతంలో రెండు రకాల విలువలను ప్రకటించారని సామాన్య మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువ విలువ, పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న వ్యక్తులకు అధిక ధరలు ఎలా వేసారని ప్రశ్నించారు. దీంట్లో అవినీతి తారాస్థాయికి చేరిందని అలాగే అర్హత లేని స్థానికేతర స్థానికేతరులు కానివారికి రేషన్‌కార్డులు మ్యాపింగ్ ఎలా చేశారన్నారు. నిజమైన స్థానికులకు మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని, ఉన్నతాధికారులు సమగ్ర సర్వే చేసి అవకతవకలు సరిచేయాలన్నారు. మండల కమిటీ సభ్యులు తాళ్లూరు శ్రీనివాసరావు, గడ్డిపాటి షణ్ముఖరావు, నాగమణి పాల్గొన్నారు.

రెండో రోజూ .. బస్సులు లేక అవస్థలు

ప్రజాశక్తి-సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో ఆర్టిసి అధికారులు బస్సు సర్వీసులు నడపకపోవడంతో రెండో రోజు కూడా ప్రయాణికులు ఇబ్బందులుకు గురయ్యారు. నైట్ సర్వీస్‌తో పాటు పగటిపూట బస్ సర్వీసులు కూడా రద్దు చేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైదాన ప్రాంతానికి వెళ్లడానికి ప్రైవేటు వాహనాన్ని ఆశ్రయిస్తే అధికచార్జీలు వసూలు చేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. మధ్యతరగతి ప్రజలు ఇటు అధిక చార్జీలు చెల్లించలేక అటు ప్రయాణం చేయలేక అవస్థలు పడుతున్నారు. ఇటీవల మావోయిస్టు వారోత్సవాలు, అనంతరం భారీ వర్షాల నేపథ్యంలో బస్సులు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా ఆర్టిసి అధికారులు స్పందించి పూర్తిస్థాయి బస్సులు నడిపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మంత్రి సంధ్యారాణి ప్రకటన మోసపూరితం

తాత్కాలిక నిలుపుదల చర్యలన్నీ నాటకం

చిత్తశుద్ధి ఉంటే హైడ్రో ఒప్పంద జిఒలు రద్దుచేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పల నర్స

ప్రజాశక్తి- పాడేరు: హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పనులు తాత్కాలికంగా నిలుపుదల చేయాలని జిల్లా కలెక్టర్‌కు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేయడం పూర్తి హాస్యాస్పదమైన, మోసపూరిత చర్య అని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తీవ్రంగా ఖండించారు. ఇటువంటి ఉత్తుత్తి, ముసుగు ప్రకటనలతో కార్పొరేట్ ప్రైవేట్ కంపెనీలకు మేలు చేసి, ఆదివాసులను మోసం చేయడానికి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదివాసుల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ఆదివాసీ గ్రామసభలకు వ్యతిరేకంగా ప్రభుత్వం జారీ చేసిన 2,13, 51 జిఒలతోపాటు హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని ఒప్పందాలు, ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలన్నారు. ఆదివాసుల హక్కులు, చట్టాల ఉల్లంఘించి, పీసా, అటవీ హక్కుల చట్టాలను తుంగలో తొక్కి ప్రభుత్వం చేసుకున్న అక్రమ ఒప్పందాలు రద్దు చేయాలని ఆదివాసులు పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేస్తుంటే, ఇప్పుడు తాత్కాలిక నిలుపుదల ప్రకటన వల్ల ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. ఆదివాసుల జల వనరులు, భూములు, అడవులు లాక్కోవడానికి కుట్రలు కొనసాగుతున్నాయని, ఇది ఆదివాసుల జీవనాధారాలపై ప్రత్యక్ష దాడిగానే సిపిఎం భావిస్తోందని ఖండించారు. సీలేరు, ఎర్రవరం, చిట్టమెలగ, గుజ్జలి, పెద్దకోట ప్రాంతాల్లో ఆదివాసుల భూములను బలవంతంగా ఆక్రమిస్తూ, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి వారిని జల సమాధి చేయడానికి ప్రభుత్వ చర్యలు మరింత తీవ్రం చేస్తోందన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో డ్రిమ్ములు వేశారని, రేయింబవళ్లు డ్రోన్ నిఘా కొనసాగిస్తున్నారని ఆక్షేపించారు. హైడ్రో అనుమతుల రద్దుకు శాంతియుతంగా ధర్నా చేసిన వారిపై అక్రమంగా పోలీసులు పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలన్నారు.

ఇవీ డిమాండ్లు

సీలేరు, ఎర్రవరం, చిట్టమెలగ, గుజ్జలి, పెద్దకోట ప్రాంతాల్లోని అన్ని హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు, ఉత్తర్వులు, జిఒలు 51, 13, 2లో తక్షణమే రద్దు చేయాలన్నారు. ప్రాజెక్ట్ ప్రభావిత భూముల్లో ఆదివాసులకు తక్షణమే పట్టాలు, పూర్తి యాజమాన్య హక్కులు ఇవ్వాలన్నారు. ఆదివాసులపై పెట్టిన అక్రమ కేసులన్నీ రద్దు చేసి, సరిహద్దు డ్రిమ్ములు తొలగించాలన్నారు. ఆదివాసీలను హింసించడం ఆపాలన్నారు. ప్రాజెక్ట్ పనులు శాశ్వతంగా నిలుపుదల చేసి, ఆదివాసుల హక్కుల చట్టాల ప్రకారం గ్రామసభల అనుమతి లేకుండా ఏ చర్యలు తీసుకోకూడదని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ ప్రభావిత గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తక్షణమే విడుదల చేసి, జల సమస్యలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కులు, ఆదివాసీదారులు కార్పొరేట్ కుట్రలకు, ప్రభుత్వ మోసాలకు బలవంతంగా బలపడకూడదన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే, ఆదివాసులతో కలిసి జిల్లా వ్యాప్తంగా తీవ్ర పోరాటాలు, ఆందోళనలు, బంద్‌లు చేపట్టి ప్రభుత్వాన్ని ఒప్పించే వరకు వదలమని హెచ్చరించారు. ఆదివాసుల పట్ల నిజాయితీగా, న్యాయంగా వ్యవహరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తాత్కాలిక రద్దు ప్రకటనతో కొత్త నాటకానికి తెరదీత

అరకులోయ రూరల్: ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతం, అల్లూరి జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాలను నవయుగ, అదానీ, శిరిడి సాయి కంపెనీలతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేసుకున్న ఒప్పంద జిఒలు 2,13,51 రద్దయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పొద్దు బాలదేవ్, ఎస్ ధర్మన్నపడాల్ స్పష్టం చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ పాడేరు పర్యటనకు వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పనులు తాత్కాలికంగా నిలిపేస్తున్నట్లు ప్రకటించి కొత్త నాటకానికి తెరలేపారని ఆక్షేపించారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ తాత్కాలికంగా నిలిపివేత కాదని, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఒప్పంద జిఒలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ నిబంధనలు, ఆదివాసీ చట్టాలు, రాజ్యాంగం కల్పించిన సర్వహక్కులను ఉల్లంఘించి రాష్ట్ర గిరిజన సలహా మండలి, ఐటిడిఏ పాలకవర్గం, ఆదివాసుల గ్రామసభ ఆమోదం లేకుండా, 170 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టాలను ఉల్లంఘించి హైడ్రో పవర్ ప్రాజెక్టుకు ఎలా ఒప్పందాలు చేసుకుంటారన్నారు. మంత్రి ప్రకటనతో గిరిజనుల్లో గందరగోళం సృష్టించి, ఉద్యమాన్ని నీరుగార్చే చర్యలను ఖండించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఒప్పంద జిఒలు రద్దుచేయాలన్నారు.

అరకులో మాట్లాడుతున్న బాలదేవ్

సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి

అరకులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పోతురాజు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయలో ఈ నెల 6.7 తేదీల్లో నిర్వహించే సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా, ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మహాసభకు జిల్లా నలుమూలల నుండి 500 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. 6న భారీ ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని, బహిరంగ సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. బహిరంగ సభలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్బి పోతురాజు, అరకులోయ మండల అధ్యక్షులు రాజు, మండల కార్యదర్శి జె భగత్‌రాం పిలుపునిచ్చారు.

ముంచింగిపుట్టు : అరకులోయలో ఈనెల 6,7 తేదీల్లో సిఐటియు జిల్లా రెండో మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి, కె శంకరరావు పిలుపునిచ్చారు. శనివారం మాట్లాడుతూ, మండలంలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు,ఎల్ఐసి, బ్యాంకు , విద్యుత్, బిఎస్ఎన్ఎల్ కార్మికులతో పాటు అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజనం , వివో ఏ, వీఆర్ఏ, 108 ,104 , 102, మెడికల్ అండ్ హెల్త్, హాస్టల్ వర్కర్లు, కాఫీ కార్మికులు, కాంట్రాక్టు ఉపాధ్యాయుల వంటి స్కీం వర్కర్ల సమస్యలపై జిల్లా మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు.

మాట్లాడుతున్న శంకరరావు

చింతపల్లి : అరకులో ఈ నెల 6, 7 తేదీలలో జరుగు సిఐటియు జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. చింతపల్లి మండలంలోని ఆస్పత్రి, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం పరిధిలోని కార్మికులతో సమావేశాలు నిర్వహించి బహిరంగ సభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిఐటియు నిరంతరం పోరాటం చేస్తోందని చెప్పారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. మహాసభ సందర్భంగా 6న అరకువేలులో కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ మహాసభలకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాజేశ్వరి, వరలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో ప్రచారం చేస్తున్న చిన్నయ్యపడాల్

బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న కృష్ణార్జునరావు

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాల అందజేత

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలో శ్రీరామగిరి పంచాయతీ పరిధిలో చొక్కనపల్లి గ్రామంలో ఇటీవల ముర్ల శిరీష ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటితో పాటు ఇంటిలో ఉన్న వంటసామాగ్రి, బట్టలు పూర్తిగా కాలిపోయి వారు నిరాశ్రయులయ్యారు. చొక్కనపల్లి' గ్రామపెద్దలు ఈ విషయం కష్ణార్జున్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాకునూరు కష్ణార్జునరావుకి తెలియజేయగా శనివారం బాధిత కుటుంబానికి బియ్యం, కూరగాయలు నిత్యావసర వస్తువులు అందజేశారు. శిరీష కృష్ణార్జున్‌కి కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో నోముల శ్రీనివాసరావు, బాగులు శ్రీనివాసరావు, గొల్ల వెంకన్న పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు నగదు అందిస్తున్న నాయీ బ్రాహ్మణులు

నాయీ బ్రాహ్మణుల ఆర్థికసాయం

ప్రజాశక్తి-కూనవరం: కూనవరంలో సెలూన్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్న శ్రీనివాస్‌కు గత నెలలో కుడి కాలుకు చిన్న ఇన్ఫెక్షన్ వచ్చి అది కాస్త పెద్దదిగా మారింది. అతని ఇబ్బంది తెలుసుకుని తోటి నాయీ బ్రాహ్మణులు రాజవొమ్మంగి, చింతూరు, ఎటపాక, నెల్లిపాక, కూనవరం, మండలాల నుంచే కాక విజయవాడ నుంచి కూడా నగదు ఫోన్ పే రూపంలో పదివేల రూపాయలు ఏర్పాటు చేసి శ్రీనివాసరావుకి అందజేశారు.కార్యక్రమంలో అల్లూరి జిల్లా నాయీబ్రాహ్మణ కన్వీనర్ ఎం వివి రాజు, కూనవరం నాయీబ్రాహ్మణ అధ్యక్షుడు కూనవరపు వెంకటరావు, మంద సూరిబాబు, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఎటపాక మండలం నుండి మాడుగుల కాసులు, యాసాని శ్రీనివాసరావు, మాడుగుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి ఉత్తరాంధ్ర సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర సమీక్ష సమావేశం ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో- ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అధ్యక్షతన భీమిలి దగ్గర చెన్న కన్వెన్షన్లో ఆదివారం జరగనుందని వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. శనివారం సాయంత్రం విశాఖపట్నం పార్టీ జిల్లా కార్యాలయంలో వారిరువురు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉత్తరాంధ్ర ప్రాంతానికి చేస్తున్న అన్యాయాన్ని ఈ సమావేశంలో వివరించడంతో పాటు, ఈ ప్రాంతానికి ఎటువంటి అభివద్ధి చేయాలి అనే అంశంపై కార్యాచరణ రూపొందించి కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా కార్యక్రమం రూపొందిస్తామన్నారు. విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 15 నెలలుగా చేస్తున్న దుర్మార్గ చర్యలపై అనేక ప్రజాపోరాటాలు చేయడం జరిగిందని ఈ ప్రాంత అభివృద్ధిని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని దీనిపై ప్రజలందరనీ మమేకం చేస్తూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్‌కుమార్,చింతలపూడి వెంకటరామయ్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

రాజవొమ్మంగి : మాట్లాడుతున్న ఎంపిటిసి పెద్దిరాజు

ప్రజాశక్తి -రంపచోడవరం: మండలంలోని వాడపల్లి గ్రామంలో శనివారం ఆది కర్మయోగి అభియాన్ రెస్పాన్సివ్ గవర్నెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం వెనుకబడిన గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నిధులతో (రక్షితనీరు, గృహాలు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, స్మశాన వాటిక అభివృద్ధికి ఉపయోగపడే కార్యక్రమంలో భాగంగా వాడపల్లి గ్రామాన్ని కేంద్ర ప్రభుత్వం దత్తత తీసుకుందన్నారు. కార్యక్రమంలో వలల బుల్లయ్య, బిజెపి మండల కార్యదర్శి, బిజెపి నాయకులు కోసు వెంకన్నదొర, సర్పంచ్, ఎంపిటిసి బచ్చల మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి బంగారురెడ్డి, సచివాలయం సిబ్బంది, వార్డుసభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలో ఆదికర్మ అభియన్‌లో భాగంగా రెండో విడత 60 పివిటిజి గ్రామాలు ఎంపికయ్యాయి. 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ గ్రామసభలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా శనివారం తిరుమలవడా డి.రామవరం పంచాయతీ, డి.అమ్మపేట గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు ఏయే అవసరాలు ఉన్నాయో అన్ని గుర్తించేందుకు తదుపరి వార్షిక ప్రణాళిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని ఎంపిడిఒ ఎవివి కుమార్ తెలిపారు.

అడ్డతీగల : అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ కుమార్

రాజవొమ్మంగి: ఆదికర్మయోగిఅభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామాలు అభివద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని ఎంపిపి గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ గొల్లపూడి లక్ష్మీదుర్గ, ఎంపిటిసిలు గొల్లపూడి పెద్దిరాజు, లోవలక్ష్మి, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు తదితరులు అన్నారు. శనివారం కిమ్మలిగెడ్డ గ్రామంలో సర్పంచ్ గొల్లపూడి లక్ష్మీ దుర్గ అధ్యక్షతన ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. ఎంపిడిఒ లోకల యాదగిరేశ్వరరావు కార్యక్రమం ముఖ్య ఉద్దేశం గూర్చి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పీసా కమిటీ అధ్యక్షులు జి. సత్తిబాబు, సభ్యులు డి.కుమార్, వార్డుసభ్యులు రెడ్డి చిన్నతల్లి, ఎన్.అబ్బులు, పంచాయితీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

చేయీా..చేయీా కలిపి.. రహదారి నిలిపి

ప్రజాశక్తి -సీలేరు: ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడలేదు వారు. చేయిచేయి కలిపి వారే రోడ్డు బాగుచేసుకున్నారు. జికె వీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి చాకిరేవిగెడ్డ ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం ధారకొండ కాలనీ యువత గ్రామపెద్దలు సమక్షంలో శ్రమదానంతో గోతులు పూడ్చే కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా చేపట్టారు. ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో గ్రామస్తులు అంతా కలసి గుంతలు పూడ్చి రహదారి బాగుచేశారు.

గోతులు పూడ్చుతున్న గ్రామస్తులు

ప్రజల మొర ఆలకించండి !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ వీక్షణం

'అన్ని అరాచకాలనూ ఒకేసారి చేసెయ్యాలి' అన్న ఇటాలియన్ తత్వవేత్త మాకియవెల్లి మాటలు గుర్తుకు తెచ్చేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ తీరు సాగుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో అభివృద్ధి పేరిట వినాశకర ప్రాజెక్టులను తెస్తోంది. ప్రజల జీవితాలను, పర్యావరణాన్ని ధ్వంసం చేసే ప్రాజెక్టుల కోసం తహతహలాడుతోంది. ప్రజల మొరను కనీసంగా ఆలకించడం లేదు. ఎంతసేపూ కార్పొరేట్లకు మేలుచేసే ప్రాజెక్టు ల దిశగానే రాష్ట్ర ప్రభుత్వం సాగుతోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దంటూ కార్మికులు, ప్రజలు ఐదేళ్లుగా పోరాడుతున్నా కూటమి సర్కారుకు పట్టడం లేదు. ప్రైవేటీకరణపై బుకాయింపులకు దిగడం పరిపాటిగా మారింది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన రాజ్యసభ ఎంపీ గొల్ల బాబూ రావు ఇటీవల స్టీల్‌ప్లాంట్‌పై పార్లమెంట్‌లో వేసిన ప్రశ్నకు..మూతకు దగ్గరగా విశాఖ ఉక్కు ఉందని సాక్షాత్తు ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి చెప్పడం చూస్తే కూటమి పాలకులు ప్రజలను, కార్మికులను ఎలా ఏమారుస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. ప్రైవేటీకరణ జరగదని మాటలు చెప్పడం తప్ప చంద్రబాబు, పవన్‌లు అదే మాటను కేంద్రంతో చెప్పించడం లేదు. దీన్ని బట్టే వారి విధానం స్పష్టమవుతోంది. విశాఖ డెయిరీ రైతుల సమస్యలపైనా, డెయిరీ యాజమాన్యం అక్రమాలపైనా వేసిన 'శాసనసభా కమిటీ'ని కూటమి ప్రభుత్వం నిద్రపుచ్చేసింది. డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ బిజెపిలో చేరడంతో ఆ విచారణ కాస్త వెనకపడింది. పెదగంట్యాడలో అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై చంద్రబాబు ప్రభుత్వం ముందు కెళ్తోంది. ఫ్యాక్టరీ వస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాలుష్యం బారిన పడి చావాల్సిందే. ప్రజల ప్రాణాలను ప్రభుత్వం లెక్కచేయకుండా అనుమతులు ఇచ్చేసింది. అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు విషయంలోనూ, అల్లూరి జిల్లా ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల విషయంలోనూ తన దూకుడును ప్రదర్శిస్తోంది తప్ప ప్రజలకు ఎదురయ్యే పరిణామాలను అస్సలు పట్టించుకోవడం లేదు. శనివారం జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రోడ్లు, ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాల లేమి, ఏజెన్సీలో నాశిరకం విత్తనాల సమస్య వంటివి ప్రస్తావనకు వచ్చాయి. సమస్యలపై ఇప్పటికైనా కూటమి సర్కారు దృష్టి సారించాల్సి ఉంది. వినాశకర ప్రాజెక్టులను నిలుపుదల చేయాల్సి ఉంది.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయ రహదారిలో జరిగిన ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం, కొమ్మాది గ్రామానికి చెందిన కంప సన్యాసమ్మ (36) భోగాపురం గ్రామంలోని తన పుట్టింటి నుండి ఉదయం 8 గంటల సమయంలో తిరిగి వస్తుండగా, పెద్దిపాలెం జాతీయ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలి భర్త కంప రామసూరి (40) ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదుచేశారు. సిఐ చింత వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.సంతోష్ కుమార్ దర్యాప్తు చేపట్టారు.

మందుగుండు సామగ్రి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలంలో అక్రమంగా మందుగుండు సామాగ్రి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని రెండు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. దిబ్బడపాలెం గ్రామానికి చెందిన దాసరి గురయ్య (55) తన ఇంటి వద్ద తారాజువ్వలు తదితర మందుగుండు సామాగ్రి తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో సిఐ వాసునాయుడు ఆదేశాల మేరకు ఎఎస్ఐ బాలమ నాయుడు సిబ్బందితో దాడులు చేశారు.

శొంఠ్యాం ఎస్‌సి, బిసి కాలనీకి చెందిన చల్ల గుర్రమ్మ (40) లైసెన్స్ లేకుండా మందుగుండు సామాగ్రి తయారు చేస్తూ పట్టుబడింది. ఈ ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. సిఐ వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ జి.సంతోష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

చినముషిడివాడలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ కాలనీ, చినముషిడివాడ కాలనీలో ఇన్‌స్పెక్టర్ కెవి.సతీష్‌కుమార్ ఆధ్వర్యాన శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరిగా రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 12 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్ షాప్ నడుపుతున్న వ్యక్తిని పట్టుకుని, 8 మద్యం సీసాలను స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఎటువంటి అసాంఘిక, నేరాత్మక కార్యకలాపాలు గమనించినా వెంటనే పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ప్రజలకు భరోసా ఇచ్చారు.

ఫాల్గుణను అభినందిస్తున్న వైసిపి నేతలు

మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణకు అభినందన

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా అరకులోయ మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణకు నియమించడంపై మండల వైసిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం అరకులోయ ఎంపీ గుమ్మ తనుజారాణితో పాటు వైస్ ఎంపిపి శెట్టి ఆనంద్రావు, మాజీ మండల అధ్యక్షుడు సిహెచ్ మల్లేష్ ఇతర నాయకులతో కలిసి చెట్టి పాల్గుణ నివాసానికి వెళ్లి శుభకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఫాల్గుణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరెడ్డికి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు, జిల్లా ఇన్‌చార్జి కురసాల కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఫాల్గుణను అభినందించిన వారిలో సర్పంచ్ నాగేశ్వరరావు, శ్యామ్ సుందర్, బాకా సింహాచలం పార్టీ మండల ఉపాధ్యక్షుడు గణపతి, మాజీ ఎంపిటిసి మహదేవ్ ఉన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు తదితరులు

డిసెంబర్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ 11వ ప్రాపర్టీ ఎక్స్‌పోను డిసెంబర్ 19,20,21వ తేదీల్లో ఎంవిపి కాలనీ బీచ్‌రోడ్‌లోని గాదిరాజు ప్యాలెస్, కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు, క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఈ.అశోక్‌కుమార్, చైర్మన్ వి. ధర్మేందర్ తెలిపారు. శనివారం నగరంలోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రియల్ఎస్టేట్ రంగంలో విశ్వసనీయతకు మారుపేరుగా ఎక్స్‌పో నిలిచిందని కొనుగోలుదారులు ఎక్స్‌పో కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. అన్ని కీలక వాటాదారులను ఒకచోట చేర్చడమే ఈ ఎక్స్‌పో లక్ష్యం అన్నారు. ప్రవేశం ఉచితం అన్నారు. సమావేశంలో సహాయ కార్యదర్శి సిహెచ్ గోవిందరాజు పాల్గొన్నారు.

సీలేరులో ఊరేగిస్తున్న దుర్గాదేవి

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవం

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం సీలేరులో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. అనంతరం భారీఎత్తున అన్నదానం కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అమ్మవారి విగ్రహాన్ని శనివారం సాయంత్రం పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం సీలేరు నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గంగవరం: మండల కేంద్రంలోని దొరమాడి గ్రామంలో, దుర్గమ్మ తల్లి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించినకుంజం రాంబాబుదొర, వనితకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జనసేన మండల అధ్యక్షులు కుంజం సిద్దు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు పచ్చకామెర్లు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : మన్యం పార్వతీపురం జిల్లా కురుపాం మండలం శివన్నపేట ఎపి బాలికల వసతిగృహ విద్యార్థినులు 22 మంది పచ్చకామెర్ల వ్యాధితో కెజిహెచ్‌కు వచ్చారని, వారిని ఇక్కడ చేర్చుకోవడం జరిగిందని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మీడియాకు తెలిపారు. వీరందరికీ గ్యాస్ట్రోఎంటరాలజి, జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్స్ డిపార్టుమెంట్స్ పరిధిలో వైద్యబృందం పరీక్షించి అవసరమైన వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం స్థిరంగా ఉందని తెలిపారు. ఎమర్జెన్సీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.నవీన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, పిడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, జనరల్ మెడిసిన్ ప్రొపెసర్, డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ జి.వానవిలత, గ్యాస్ట్రోఎంటరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ యల్.ఆర్.ఎస్.గిరినాథ్ పర్యవేక్షణలో చికిత్స అందించటం జరిగిందని తెలిపారు.